## విభిన్న ప్రతిభావంతులకు రేపు క్రీడా పోటీలు

బెలగాం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ఈ నెల 27న క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఇందులో పాల్గొనొచ్చని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులైన యువత, విద్యార్థులు వారి గుర్తింపు కార్డుతో హాజరుకావాలని కోరారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, పవర్ లిఫ్టింగ్ తదితర విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# ఇన్‌చార్జిలతో ఇంకెన్నాళ్లు?

- హౌసింగ్ శాఖకు అధికారుల కొరత ● కొరవడిన పర్యవేక్షణ
- గృహ నిర్మాణాలపై ప్రభావం ● లక్ష్యాలు నెరవేరేనా?


పార్వతీపురంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ కార్యాలయం

పార్వతీపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గృహ నిర్మాణ శాఖకు అధికారుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. కొన్నేళ్లుగా ఇన్‌చార్జిల పాలనతోనే నెట్టుకొస్తున్నారు. జిల్లా ఏర్పడి నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. గత వైసీపీ సర్కారు పోస్టుల భర్తీకి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఫలితంగా క్షేత్రస్థాయిలో సిబ్బంది లేక పర్యవేక్షణ కొరవడుతోంది. దీంతో గృహ నిర్మాణాల్లో పురోగతి కనిపించడం లేదు. ఆశించినస్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించాల్సి ఉంది.

**సిబ్బంది ఇలా..**

- జిల్లాలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టు కొన్నేళ్లుగా ఖాళీగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో పీడీగా రఘురాం పనిచేసేవారు. 2023, మే 5న ఆయన్ని బదిలీ చేశారు. అప్పటి నుంచి ఆ పోస్టును భర్తీ చేయలేదు. ఇతర శాఖలకు చెందిన అధికారులే ఇన్‌చార్జి పీడీగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి ఇన్‌చార్జి పీడీగా కొనసాగుతున్నారు.
- జిల్లాలో రెండు డివిజన్లకు పూర్తిస్థాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు లేరు. పార్వతీపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఆ శాఖకు చెందిన పార్వతీపురం డీఈ సోమేశ్వరరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. పాలకొండ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పంచాయతీరాజ్ డీఈ రవి కొనసాగుతున్నారు. పీఆర్ ఇన్‌చార్జి ఈఈ, హౌసింగ్‌లో డీఈగా కూడా ఆయన వ్యవహరిస్తున్నారు. మొత్తంగా నాలుగు పోస్టుల బాధ్యతలు చూస్తున్నారు.
- కురుపాం గృహ నిర్మాణ శాఖ డీఈగా పంచాయతీరాజ్ డీఈ నంద వెంకటరావు అదనపు బాధ్యతలు అప్పగించారు. పీఆర్ డీఈ చిన్నంనాయుడు గృహ నిర్మాణశాఖ సాలూరు ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉన్నారు.
- వీరఘట్టం ఏఈ వినోద్‌కుమార్ భామిని మండలానికి ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పార్వతీపురం, కురుపాం, కొమరాడ మండలాలకు మాత్రమే పూర్తిస్థాయి రెగ్యులర్ ఏఈలు ఉన్నారు. మిగిలి మండలాలకు ఔట్‌సోర్సింగ్ విధానంలో ఏఈలు పనిచేస్తున్నారు.


సీతంపేట రూరల్: తలేబుగూడలో పునాది దశలోనే ఉన్న గృహం

**ఇదీ పరిస్థితి..**

కేంద్ర ప్రభుత్వం 2.0 స్కీంలో భాగంగా పార్వతీపురం, సాలూరు పురపాలక సంఘాల్లో కొత్తగా 634 ఇళ్లు మంజూరు చేశారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో పీఎంఏవై 2.0 స్కీమ్‌లో భాగంగా సర్వే కొనసాగుతుంది. ఈ నెల 30తో ఇది ముగుస్తుంది. జిల్లాలో సుమారు 2,33,44 మందికి ఇళ్లు మంజూరయ్యే పరిస్థితి ఉంది. పీఎం జన్‌మన్ స్కీమ్‌లో భాగంగా సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, కురుపాం తదితర మండలాల్లోని షెడ్యూల్డ్ గ్రామాల్లో పీవీటీజీలకు 5,169 ఇళ్లు మంజూరు చేశారు. వాటిల్లో 683 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. అయితే వీటి పర్యవేక్షణ, బిల్లుల మంజూరు, గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు సహకారం అందించేందుకు అవసరమైన హౌసింగ్ సిబ్బంది జిల్లాలో లేరు. ఏ శాఖకైనా పూర్తి స్థాయి అధికారులు, పర్యవేక్షణ ఉంటేనే పనుల్లో ప్రగతి కనిపిస్తుంది. కానీ గృహ నిర్మాణ శాఖలో భిన్న పరిస్థితి నెలకొంది. వాస్తవంగా ఒక శాఖ అధికారి మరొక శాఖ విధులు నిర్వహించాలంటే కష్టం. మరోవైపు వీడియో, టెలీ కాన్ఫరెన్స్‌లు, సమీక్షలకే టైం సరిపోతుంది. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి అధికారుల పాలనలో గృహ నిర్మాణ లక్ష్యాలు ఏ విధంగా నెరవేరుతాయో (మిగతా 8వ పేజీలో..)

# విద్యార్థుల నోట అధ్యక్షా!

- నేడు అమరావతిలో మాక్ అసెంబ్లీ ● పయనమైన మన్యం విద్యార్థులు
- వారిలో సీఎం హోదాకు ఒకరు ఎంపిక ● సమస్యలతో పాటు పలు అంశాలపై చర్చ



సీఎం, ఎమ్మెల్యేగా ఎంపికైన లీలా గౌతం, నిహారిక

పాలకొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులు అసెంబ్లీలో అధ్యక్షా! అనేందుకు సిద్ధమయ్యారు. నియోజకవర్గ సమస్యలతో పాటు పలు అంశాలపై గళమెత్తనున్నారు. ఇందుకోసం వారంతా అమరావతికి పయనమయ్యారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అసెంబ్లీ ఆవరణలో మాక్ అసెంబ్లీ నిర్వహించనున్నారు. ఇందులో జిల్లా విద్యార్థులు పాల్గొనున్నారు. ప్రజాప్రతినిధుల హోదాలో పలు అంశాలపై చర్చించనున్నారు. వీరిలో అసెంబ్లీ మార్షల్‌గా జియ్యమ్మవలస మండలం జడ్పీహెచ్‌ఎస్ బీజేపురం టెన్త్ విద్యార్థి మద్ది లీలా గౌతం ఎంపికయ్యాడు. ఆ విద్యార్థి పెర్ఫార్మెన్స్ బాగుండడంతో ఏకంగా సీఎంగా ఎంపికయ్యాడు. గరుగుబిల్లి జడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థి డి.దినేష్‌కుమార్ ఎమ్మెల్యే హోదాలో మాక్ అసెంబ్లీకి హాజరుకానున్నాడు. పాలకొండ మండలం ఎం.సింగుపురం జడ్పీ హెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థిని గంధారపు నిహారిక ఎమ్మెల్యేగా ఎంపికైంది. బలిజిపేట కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న దువ్వు జయంతి ఆర్థికశాఖామంత్రిగా అసెంబ్లీకి వెళ్లనుంది. మక్కువ జడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థిని సాయిసౌమ్య ప్రతిపక్ష ఎమ్మెల్యేగా మాక్ అసెంబ్లీకి హాజరుకానున్నారు. వారంతా రాజ్యాంగం ఆవశ్యకత, విలువలు, ప్రజా ప్రతినిధుల బాధ్యతలు, విధులు, ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించనున్నారు.


ఎమ్మెల్యేలుగా మాక్ అసెంబ్లీలో అడుగుపెట్టనున్న సౌమ్య, జయంతి, దినేష్

**ఎంపిక ఇలా...**

రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని కూటమి ప్రభుత్వం విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం మండలం, నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులను ఎంపిక చేశారు. చివరిగా వారిలో నియోజకవర్గానికి ఒకరి చొప్పున ఎంపిక చేశారు. జిల్లాలో మార్షల్‌గా ఎంపికైన లీలాగౌతం ప్రతిభను గుర్తించి అధికారులు ముఖ్యమంత్రి హోదాకు ఎంపిక చేయడం గమనార్హం.

**జిల్లా విద్యార్థి సీఎంగా ఎంపిక**

మాక్ అసెంబ్లీకి జిల్లా విద్యార్థులు ఎంపిక కావడం సంతోషకరం. వారిలో మార్షల్‌గా ఎంపికైన విద్యార్థి లీలా గౌతంను ముఖ్యమంత్రి హోదాకు ఎంపిక చేయడం హర్షణీయం. వీరు పలు అంశాలపై మాక్ అసెంబ్లీల్లో చర్చిస్తారు.

\- బి.రాజ్‌కుమార్, డీఈవో

# ఎటువంటి మార్పుల్లేవ్

- విజయనగరం జిల్లాలోనే మెంటాడ
- నియోజకవర్గం మాత్రం సాలూరే.. ● ప్రకటించిన ప్రభుత్వం

పార్వతీపురం,నవంబరు25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో మూడు జిల్లాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో జిల్లాల సంఖ్య 26 నుంచి 29కి చేరనుంది. కొత్తగా ఐదు రెవెన్యూ డివిజన్లు, ఒక మండలం ఏర్పాటుకు సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. అయితే ఉమ్మడి జిల్లాలో ఎటువంటి మార్పులు చేయలేదు. సాలూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న మెంటాడను రాజకీయ కారణాల రీత్యా అప్పట్లో వైసీపీ ప్రభుత్వం విజయనగరంలో చేర్చింది. దీనిపై ఎన్నో విమర్శలు వెల్లువెత్తాయి. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల విభజనపైనా కూడా పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో కూటమి ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. నియోజకవర్గంలో ఉన్న మండలాలన్నీ ఒకే డివిజన్ పరిధిలో ఉండాలనే సర్కారు భావించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో మార్పులుంటాయని అంతా భావించారు. కానీ మెంటాడను విజయనగరం జిల్లాలోనే ఉంచారు. ఈ మండలాన్ని పార్వతీపురం మన్యంలో చేర్చలేదు. మొత్తంగా ప్రభుత్వ నిర్ణయం జిల్లాలో అమలు కాలేదు.

**పాలకొండ జిల్లా లేనట్టే...**

పాలకొండను జిల్లా ఏర్పాటు చేయాలని ఆ ప్రాంతంలో కొంతమంది డిమాండ్ చేశారు. జిల్లా ఏర్పాటుకు ఏర్పడిన కమిటీ ప్రభుత్వ పెద్దల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. కురుపాం నియోజకవర్గంలోని నీలకంఠాపురం మండలం ఏర్పాటుపై కూడా ప్రభుత్వం ఏటువంటి ప్రకటన చేయలేదు.

## ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి ● పెద్దఖేర్జలో 'రైతన్నా.. మీకోసం' 8లో

## ఇక్కడి నుంచి వెళ్లిపోండి

- ఒడిశా అధికారుల దూకుడు..
- కొరియాలో ఆంధ్రా కార్యక్రమాలు చేపట్టొద్దు
- ఎగువమెండంగిలో ఏపీ సిబ్బంది అడ్డగింత

మక్కువ రూరల్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ఏవోబీ సరిహద్దు ప్రాంతం కొఠియాలో మరోసారి ఒడిశా అధికారులు రెచ్చిపోయారు. ఏపీ ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడానికి వీల్లేదంటూ హుకుం జారీ చేశారు. మంగళవారం ఎగువ మెండంగిలో 'రైతన్నా.. మీ కోసం' నిర్వహించేందుకు వ్యవసాయశాఖతో పాటు పట్టుచెన్నూరు సచివాలయ సిబ్బంది అక్కడకు వెళ్లారు. గ్రామస్థులతో కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో ఒడిశా రాష్ట్రం పొట్టంగి బీడీవో రామచంద్రనాయక్, తహసీల్దార్ దేబేంద్రధరువా పోలీసులతో ఆ గ్రామానికి చేరుకున్నారు. కొఠియా గ్రామాల్లో ఎటువంటి సర్వేలు, కార్యక్రమాలు చేపట్టొద్దని ఏపీ సిబ్బందిని అడ్డుకున్నారు. కొఠియా గ్రామాలు ఒడిశా రాష్ట్రంలో విలీనమై ఉన్నాయని, ఆంధ్రా ప్రభుత్వ కార్యకలాపాలేవీ ఇక్కడ నిర్వహించడానికి వీల్లేదని చెప్పారు. తక్షణమే ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని అనడంతో ఏపీ సిబ్బంది వెనుదిరిగారు. కాగా ఒడిశా అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 14న గంజాయిభద్రలో తోణాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని వారు అడ్డుకున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా మరోసారి ఒడిశా అధికారులు రెచ్చిపోయారు. కొఠియాపై ఆలోచించాలని ఈనెల 16న పాడేరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఒడిశా ముఖ్యమంత్రికి మంత్రి సంధ్యారాణి లిఖితపూర్వక విజ్ఞాపన చేశారు. అయినప్పటికీ అక్కడ పరిస్థితి మారలేదు. దీనిపై ఇరురాష్ట్రాల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.


ఎగువమెండంగిలో ఏపీ సిబ్బంది చేపట్టిన 'రైతన్నా..మీకోసం' కార్యక్రమాన్ని అడ్డుకుంటున్న ఒడిశా అధికారులు

# ఫోన్ వద్దు.. పుస్తకం ముద్దు

- సాహితీవేత్తలకు పుట్టినిల్లు మన్యం జిల్లా
- కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

బెలగాం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో యువత, పిల్లలు ఎక్కువగా మొబైల్ ఫోన్లకు హత్తుకుపోతున్నారని, పుస్తక పఠనంతో మేధస్సు మెరగవుతుందని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. 'ఫోన్ వద్దు.. పుస్తకం ముద్దు' అని తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పుస్తక మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయ వాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ పార్వతీపురంలో మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. వయసు, హోదాతో సంబంధం లేకుండా పుస్తక పఠనం ముందు అందరూ పిల్లలే అని గుర్తు చేశారు. జిల్లాలో గొప్ప కవులు, రచయితలు ఉన్నారని, సాహితీవేత్తలకు జిల్లా పుటినిల్లు అని తెలిపారు. పది రోజుల పాటు జరిగే ఈ పుస్తక మహోత్సవాన్ని సాహిత్య ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బుక్ ఫెస్టివల్‌లో పుస్తకాలను చూస్తున్న కలెక్టర్, ఎస్పీ

**గడువులోగా రీ సర్వే పూర్తి చేయాలి**

నిర్దేశిత గడువులోగా రెవెన్యూ అధికారులు జిల్లాలో రీ సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. 'తహసీల్దార్ల కార్యాలయాల రూపు రేఖలు మారాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. సబ్ కలెక్టర్లు మండలాల్లో విస్తృతంగా పర్యటించాలి. కుల ధ్రువీకరణ పత్రాలు వీలైనంత త్వరగా మంజూరు చేయాలి. చెరువులు, రహదారులు ఆక్రమణదారులపై విధానపరమైన చర్యలు తీసుకోవాలి'. అని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జేసీ యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో హేమలత తదితరులు పాల్గొన్నారు.

**వివక్ష లేకుండా చర్యలు**

సమాజంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమేనని, వివక్ష లేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టి అవగాహన కల్పించాలని కలెక్టర్ (మిగతా 8వ పేజీలో...)

మూడు పీఏసీఎస్‌లకు పాలక మండళ్లు 8లో

టెక్నికల్ అసిస్టెంట్‌పై క్రమశిక్షణ చర్యలు 8లో

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా 7లో

పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి ● జేఎన్‌టీయూ వీసీ సుబ్బారావు 7లో


కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ

## లక్ష్య సాధనకు కృషి

- ఆర్‌జేడీ విజయభాస్కర్

భామిని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యంగా ఉండి విద్యార్థులు విద్యతో పాటు లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని ఆర్‌జేడీ విజయభాస్కర్ సూచించారు. మంగళవారం భామినిలో ఆదర్శపాఠశాల, కేజీబీవీని సందర్శించారు. వాటి నిర్వహణపై ఆరా తీశారు. విద్యార్థు లతో కాసేపు మాట్లాడారు. పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం, పాఠశాల పరిసరాలు, టాయిలెట్లను పరిశీ లించారు. వచ్చే నెల 6న మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ నిర్వహించాలని, ఇందుకోసం పాఠశా లల క్రీడా మైదానాలను సిద్ధం చేయాలని సూచించారు. డీఈవో రాజ్‌కుమార్, డిప్యూటీ డీఈవో టి.కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

# సాంకేతికతతో నేరాల నియంత్రణ

- ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల దర్యాప్తు, నేరస్థులను గుర్తించేందుకు సాంకేతికతను వినియోగించాలని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి ఆదేశించారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో వర్చువల్‌గా నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, చీటింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాలు తదితర కేసులపై సమీక్షించారు. తొలుత పెండింగ్ కేసులపై ఆరా తీశారు. వాటి పరిష్కారానికి తగిన సూచనలు, సలహాలు అందించారు. సుదీర్ఘ పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తి చేసి చార్జ్ షీట్స్ కోర్టుకు సమర్పించాలన్నారు. గంజాయి, సారా, మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా కేసుల్లో పరారీలో ఉన్న వారిని తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న ఎన్‌బీడబ్ల్యూ అమలు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన ప్రతి కేసు వివరాలను సీసీటీఎన్‌ఎస్‌లో పొందుపరచాలని తెలిపారు. హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించి, రోడ్డు భద్రతా నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మహిళా సం బంధిత నేరాలపై ప్రత్యేక శ్రద్ధతో దర్యాప్తు జరపాలని, పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో మహిళలపై దాడులు జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు, శక్తి యాప్, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సోషల్ మీడియా కేసులను ఏ విధంగా దర్యాప్తు చేయాలో సూచించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ వెంకటేశ్వరరావు, డీఎస్పీ రాంబాబు, డీసీఆర్‌బీ సీఐ ఆదాం, సీఐలు శ్రీనివాసరావు, మురళీధర్, రంగనాథం పాల్గొన్నారు.



భజన మందిరాల నిర్మాణానికి దరఖాస్తుల ఆహ్వానం ● జిల్లా దేవదాయశాఖాధికారి రాజారావు 8లో

వీఆర్‌ఎస్ నుంచి 300 క్యూసెక్కులు విడుదల 8లో

కాంగ్రెస్ పార్టీ పరిశీలకుల రాక రేపు 8లో

వేడుకల్లో లెహంగా, శారీస్‌ను ఎంచుకోడానికి వెనకాడేవారు నిరభ్యంతరంగా షరారాలను ఎంచుకోవచ్చు. సౌకర్యం, స్టైల్‌కు పెద్ద పీట వేసే డిజైనర్ షరారాలు అన్ని వేడుకలకూ అనువుగా ఉంటాయి. తాజాగా ట్రెండ్ అవుతున్న వాటి మీద ఓ లుక్కేద్దాం!

# షరారా షరారా





పండుగలు, పెళ్లిళ్లు, పుట్టిన రోజు వేడుకలు.. ఇలా అన్ని రకాల వినోదాల్లో ధరించడానికి వీలుండే దుస్తులు.. డిజైనర్ షరారాలు. ప్రస్తుతం ఇవి ట్రెండ్‌గా మారాయి. డిజైనర్లు ఆధునికత ఉట్టిపడే డిజైనర్ వెర్షన్లను రూపొందిస్తూ ఉండడంతో, కొత్త కొత్త హంగులతో, ఫ్యూజన్ స్టైల్స్‌తో షరారాలు మహిళల మనసులను దోచుకుంటున్నాయి. మరీ ముఖ్యంగా వధువులు కూడా రిసెప్షన్స్, ఎంగేజ్‌మెంట్ ఫంక్షన్ల కోసం డిజైనర్ షరారాలనే ఎంచుకుంటూ ఉండడం చెప్పుకోదగిన విశేషం. జారుతున్నట్టు క నిపించే మెటీరియల్స్, రిల్యాక్స్‌డ్ ఫిట్టింగ్స్‌తో రూపొందుతున్నాయి కాబట్టి వీటిని ధరించడమూ సులభమే! ప్రత్యేకించి లెహంగాలతో పోలిస్తే షరారాలతో రెట్టింపు సౌకర్యం ఉంటుంది.

### తాజా ట్రెండ్స్ ఇవే!

- ఎంబ్రాడిరీ, అద్దం పనితనం: సంక్లిష్టమైన ఎంబ్రాయిడరీ, అద్దం పనితనంతో కూడిన షరాలు తాజా ట్రెండ్‌గా మారాయి
- ప్రింటెడ్ డిజైన్లు కూడా బాగా ఆదరణ పొందుతున్నాయి
- చందేరి, ఇతరత్రా తక్కువ బరువుండే వస్త్రాలతో రూపొందే షరారాలు ప్రత్యేకించి వేసవి వస్త్రాలుగా పేరు తెచ్చుకుంటున్నాయి
- సంప్రతాయ, సమకాలీన స్టైల్స్‌ను మేళవించి, రూపొందిస్తున్న డిజైనర్ షరారాలు ఆధునిక ఫ్యూజన్ ఛాయిస్‌గా పేరు తెచ్చుకుంటన్నాయి.



### అదనపు హంగులు జోడించి...

షరారాలతో భారీ ఆభరణాలు చాలా బాగా నప్పుతాయి. ఈ దుస్తుల కోసం చాంద్‌బాలీ, కంగన్ లేదా కడా లాంటి ఆభరణాలు ఎంచుకోవచ్చు. చమ్కీ పనితనానికి రాళ్ల నగలు చక్కగా నప్పుతాయి. హైహీల్స్ లేదా బ్లంట్ హీల్స్ ధరించాలి.

---

పశువుల్లో కృత్రిమ గర్భధారణపై పాడి రైతులకు అవగాహన కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నారు **చాకలి అనురాధ**. నంద్యాల జిల్లా చింతకుంటలో జూనియర్ వెటర్నరీ అధికారి అయిన ఆమె.. తన సేవలకు గుర్తింపుగా 'జాతీయ గోపాలరత్న' పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం నుంచి నేడు అందుకోబోతున్నారు. "పాడి పరిశ్రమ అభివృద్ధికి రైతుల్లో చైతన్యమే మార్గం" అంటున్న అనురాధను 'నవ్య' పలకరించింది.

# ఈ అనురాధ గోపాల మిత్ర



"నా స్వస్థలం ప్రస్తుత నంద్యాల జిల్లా గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామం. నా తల్లిదండ్రులు చాకలి లక్ష్మీదేవి, సుబ్బారాయుడు. వారిది రజక వృత్తి. పేదరికం వల్ల మేము ఎన్నో ఇబ్బందులు పడ్డాం. నేను పదో తరగతి వరకూ మా ఊరిలోనే చదువుకున్నాను. నంద్యాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేశాను. నా మేనమామ రవిశంకర్‌తో నా వివాహం అయింది. మాకు ఇద్దరు పిల్లలు... రిషిత, యోగీశ్వర్. నా భర్త ప్రోత్సాహంతో 2004లో వెటర్నరీ అసిస్టెంట్ పోస్టు కోసం పరీక్ష రాశాను. సుమారు 350 మంది పోటీ పడితే... ఎంపికైన ఆరుగురిలో నేనొకరిని. శిక్షణ తరువాత, 2006లో... బండి ఆత్మకూరులో కాంట్రాక్ట్ విధానంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాను. రెండేళ్ల తరువాత ఉద్యోగం రెగ్యులర్ అయింది. ఆ తరువాత గడివేముల మండలం బిలకలగూడూరులోని రూరల్ లైవ్ స్టాక్ యూనిట్‌లో (ఆర్ఎల్‌యూ) లైవ్ స్టాక్ అసిస్టెంట్‌గా పని చేశాను. 2019లో జూనియర్ పశువైద్యాధికారి (జేవీఓ)గా పదోన్నతి పొందాను. ఆరేళ్లపాటు మహానంది మండలం గోపవరంలో పని చేశాను.

### 'ట్రిపుల్-ఎస్ అనురాధ' అంటారు

ఆ సమయంలోనే కేంద్ర ప్రభుత్వం 'సెక్స్-సోర్టెడ్ సెమెన్ ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్' (ట్రిపుల్ ఎస్ఏఐ)' విధానాన్ని అమలు చేసింది. ఈ విధానం పాడి రైతులకు ఉపయోగకరం. దాని గురించి రైతుల్లో అవగాహన కల్పించడానికి క్షేత్రస్థాయిలో అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాను. ఎన్నో పశువులకు కృత్రిమ గర్భధారణ ప్రక్రియ నిర్వహించాను. మూడేళ్లలో 345 వరకూ మేలు జాతి ఆడ దూడలు నా పర్యవేక్షణలో జన్మించాయి. ఎక్కువ కృత్రిమ గర్భధారణలు నిర్వహించడంతో నన్ను మా శాఖలో 'ట్రిపుల్ ఎస్ అనురాధ' అంటారు. నేను అందించిన సేవలకు ఇలాంటి ప్రత్యేక గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. అలాగే... పశువులను సమయానుగుణంగా వాక్సినేషన్ లాంటి కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున చేపట్టాను. ఈ ఏడాది జూన్ నెలలో గోస్పాడు మండలం చింతకుంటకు బదిలీపై వచ్చాను. విధుల్లో నేను అందించిన సేవలకు గుర్తింపుగా... 2021లో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయిలో, 2023లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉద్యోగి పురస్కారాలను, ఈ ఏడాది ఆగస్టు 15న జిల్లా స్థాయిలో ఉత్తమ ఉద్యోగి ప్రశంసా పత్రాన్ని అందుకున్నాను. ఇప్పుడు జాతీయ స్థాయిలో అవార్డు అందుకోబోతున్నాను.

### వారి ప్రోత్సాహంతో...

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది 'జాతీయ గోపాలరత్న' అవార్డులు ప్రదానం చేస్తుంది. మూడు కేటగిరీల్లో... ఒక్కొక్క దానికి మూడు చొప్పున మొత్తం తొమ్మిది అవార్డులు అందిస్తారు. ఈ ఏడాది వీటికోసం 2,018 మంది పోటీ పడ్డారు. 'ఉత్తమ కృత్రిమ గర్భధారణ నిపుణుల విభాగం'లో నాకు మూడో స్థానం లభించినట్టు ఈ నెల 17న ప్రకటించారు. దాన్ని నేడు (బుధవారం) ఢిల్లీలోని సుష్మాస్వరాజ్ భవన్‌లో అందుకోబోతున్నాను. ఈ పురస్కారంతో నంద్యాల జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కిందని అందరూ చెబుతూ ఉంటే సంతోషంగా అనిపిస్తోంది. చదువులో నా తల్లిదండ్రులు, ఉద్యోగ ప్రయత్నంలో నా భర్త సహకారంతోనే ఈ స్థాయికి వచ్చాను. ఉద్యోగపరంగా వైద్యులు, అసిస్టెంట్ డైరెక్టర్లు, జిల్లా అధికారులు ఎంతగానో ప్రోత్సహించడంతో.. విధుల్లో చురుకుగా పని చేసి, రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించగలిగాను. ఎక్కువ సంఖ్యలో కృత్రిమ గర్భధారణలకు దోహదం చేశాను. వాటన్నిటి ఫలితమే ఈ పురస్కారం. ఇదే స్ఫూర్తితో... భవిష్యత్తులో పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తాను."

• చదువుల గోపాలకృష్ణ, నంద్యాల

---

విజేత

సవాళ్లను స్వీకరించడం... అపజయాలను పాఠాలుగా మలుచుకోవడం... లక్ష్యం చేరేవరకు పట్టుదలగా ప్రయత్నించడం... ఇవే ఒక యోధుడిని తయారు చేస్తాయి. అందుకు నిలువెత్తు నిదర్శనం... **అనుపమా రామచంద్రన్**. కఠిన పరీక్షలు ఎదురైనప్పుడు వెనకడుగు వేయకుండా... క్లిష్ట సమయాల్లో ఒత్తిడికి చిత్తవకుండా... ఆత్మస్థైర్యంతో అందలాన్ని అందుకుంది. ఇటీవల ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్ గెలిచిన 23 ఏళ్ల అనుపమ... ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళగా చరిత్ర సృష్టించి... నవ శకానికి నాంది పలికింది.



# ఆమె సంకల్పం.. 'అనుపమా'నం

ఖతర్ రాజధాని దోహా... ఐబీఎస్ఎఫ్ ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్... అంతిమ సమరం... ప్రత్యర్థి ఎంగ్‌ఆన్ యీ... మూడుసార్లు ప్రపంచ చాంపియన్. ఎన్నో ఏళ్లుగా నెంబర్ వన్ ర్యాంకర్. కేవలం నైపుణ్యాన్ని మాత్రమే కాకుండా ధైర్యాన్ని పరీక్షించే మ్యాచ్. చివరి ఫ్రేమ్. 2-2 వద్ద విజయం ఊగిసలాడుతోంది. అనుపమా రామచంద్రన్ చేతిలో క్యూ. నవచరిత రాయడానికి షాట్ దూరం. ఒక్క క్షణం ఆగి... ఆమె గట్టిగా ఊపిరి పీల్చుకుంది. ఒత్తిడిలోకి వెళ్లకుండా తనను తాను స్థిమితంగా ఉంచుకుంది. ఏకాగ్రతతో, పూర్తి నమ్మకంతో షాట్ కొట్టింది. బంతి పాకెట్‌లోకి దూసుకుపోయింది. ఆ ప్రాంతమంతా చప్పట్లు, జయజయ ధ్వానాలతో మార్మోగింది. భారత్‌లో మొట్టమొదటిసారి ఒక మహిళ ప్రపంచ స్నూకర్ చాంపియన్‌గా అవతరించింది. అయితే ఈ గెలుపు అనుపమకు అంత సులువుగా దక్కలేదు. దీని వెనుక నిరంతర కృషి ఉంది. సడలని సంకల్పం ఉంది. దీనికి బలమైన పునాది 2015లో పడింది.

### వేసవి క్యాంపుతో...

చెన్నైలో పుట్టి పెరిగిన అనుపమ కోరి స్నూకర్‌ను ఎంచుకోలేదు. ఆట మొదలుపెట్టేవరకూ దానిపై అసలు దాని గురించి తెలియదు. "అప్పుడు నాకు పదమూడేళ్లు. మా ఇంటికి దగ్గర్లో 'మైలాపూర్ క్లబ్' ఉంది. సెలవులు కావడంతో క్లబ్‌లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. అక్కడ చెస్, స్నూకర్ మాత్రమే ఉన్నాయి. చెస్ ఇంట్లో ఆడుతూనే ఉంటాను కాబట్టి, స్నూకర్ నేర్చుకోవాలని అనుకున్నా. అంతే కాదు... ఆకుపచ్చని బోర్డు, రంగురంగుల బాల్స్, చేతిలో క్యూ... చూడగానే నన్ను బాగా ఆకట్టుకున్నాయి. ఎలా ఆడతారో తెలుసుకోవాలన్న ఆసక్తి ఎక్కువైంది. క్యాంపులో చేరాక అందులో లీనమైపోయాను. కోచ్ లో... నా ప్రతిభను చూసి స్నూకర్ కొనసాగించమని చెప్పారు" అంటూ చిన్ననాటి రోజులు గుర్తు చేసుకున్న అనుపమ... వేసవి శిబిరం పూర్తవగానే ప్రొఫెషనల్ కోచింగ్‌లో చేరింది.

### అందుకే ప్రత్యేకం

చిన్నప్పుడు కోచ్‌లు అనుపమలో గుర్తించినవి... సడలని ఏకాగ్రత, ఓపిక. సాధారణంగా ఆ వయసు పిల్లల్లో ఈ లక్షణాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. వీటిని అలవర్చుకోవడానికి చాలామంది ఆటగాళ్లకు సంవత్సరాలు పడుతుందనేది శిక్షకుల మాట. అందుకే ఆమెను ప్రత్యేక ప్రతిభ గల అమ్మాయిగా పరిగణించారు. ఆ స్థాయిలోనే శిక్షణ ఇచ్చారు.



స్పోర్ట్స్ పెర్‌ఫార్మెన్స్ స్పెషలిస్టు, తన మామయ్య అయిన కె.నారాయణన్ మార్గదర్శకత్వంలో అనుపమ ఆటలో మరింత పరిణతి సాధించింది. ఆయన నేతృత్వంలో సాంకేతిక అంశాలను ఆకళింపు చేసుకుంది. వ్యూహాలు నేర్చుకుంది. క్లిష్ట సమయాల్లో ఒత్తిడిని ఎలా జయించాలో, మనోధైర్యంతో అడుగులు ముందుకు ఎలా వేయాలో తెలుసుకుంది. నిరంతర సాధనతో పరిపూర్ణ క్రీడాకారిణిగా తనను తాను తీర్చిదిద్దుకుంది.

### మలుపు తిప్పిన గెలుపు

స్నూకర్, ఇంగ్లీష్ బిలియర్డ్స్‌లో ఎంతో పరిణతి సాధించిన అనుపమ... జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ అదరగొట్టింది. ఏకంగా ఎనిమిది జాతీయ జూనియర్ టైటిల్స్ నెగ్గిన ఆమె కెరీర్‌ను 2017లో రష్యాలో జరిగిన 'వరల్డ్ ఓపెన్ అండర్-16 స్నూకర్ చాంపయిన్‌షిప్' మలుపు తిప్పింది. అంచనాలు తలకిందులు చేస్తూ విజేతగా నిలిచింది. దాంతో అనుపమ సీనియర్ విభాగంపై కూడా దృష్టి పెట్టింది. 2023లో 'ప్రపంచ మహిళల అండర్ 21 స్నూకర్' టైటిల్ సాధించింది. మరుసటి ఏడాది 'యూఎస్ ఉమెన్స్ ఓపెన్'లో రన్నరప్‌గా నిలిచి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దాంతో ఈ ఏడాది ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానం దక్కించుకుంది. ఆమె కెరీర్ ఇదే అత్యున్నత ర్యాంక్.

ప్రపంచ చాంపియన్...

చిన్న వయసులోనే ఎన్నో మైలురాళ్లను అధిగమించిన అనుపమ... చదువును అశ్రద్ధ చేయలేదు. చెన్నైలోని 'విద్యా మందిర్ సీనియర్ సెకండరీ స్కూల్'లో చదివిన ఆమె, ప్రస్తుతం వైష్ణవ్ మహిళా కళాశాలలో పబ్లిక్ పాలసీలో పీజీ చేస్తోంది. అంతర్జాతీయ స్థాయి పోటీపడుతూనే... అటు ఆటను, ఇటు చదువును సమన్వయం చేసుకొంటోంది. ఇక ఈ నెల రెండో వారంలో దోహాలో జరిగిన 'ఐబీఎస్ఎఫ్ ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్'లో టాప్ ర్యాంకర్‌ను ఓడించి నవ శకానికి నాంది పలికింది. భారత్‌ను చాంపియన్‌గా నిలబెట్టింది. ఈ గెలుపు ఆమెది మాత్రమే కాదు... ఈ క్రీడలో రాణించాలని కలలు కనే అమ్మాయిలు అందరిదీ. భారతీయ స్నూకర్‌ది. నిశ్శబ్దంగా, ఓపికగా, పట్టుదలగా, ఒక్కో అడుగు ముందుకు వేస్తూ... శిఖరాగ్రానికి చేరిన దృఢ సంకల్పానిది.

---

# ముఖానికి నెయ్యి రాస్తే...



ఆరోగ్యంతోపాటు చర్మ సౌందర్యాన్ని పెంపొందించడంలో నెయ్యి కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ముఖానికి నెయ్యి రాసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం...

- వయసు పెరిగే కొద్దీ ముఖం మీద ముడుతలు, గీతలు ఏర్పడుతుంటాయి. వీటిని నివారించేందుకు యాంటీ ఏజింగ్ క్రీమ్‌లు, మాయిశ్చరైజర్లు వాడేబదులు ముఖానికి నెయ్యి రాసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. నెయ్యిలో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు చర్మానికి పోషణను అందించే ఎ, డి, ఇ, కె విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. దీంతో చర్మం మృదువుగా కాంతివంతంగా మారుతుంది.
- నెయ్యిని ముఖానికి పట్టించి చేతి వేళ్లతో సున్నితంగా వృత్తాకారంలో మర్దన చేయాలి. దీనివల్ల చర్మానికి రక్తప్రసరణ పెరుగుతుంది. చర్మకణాలు వృద్ధి పొందుతాయి. దీంతో చర్మానికి సహజసిద్ధమైన మెరుపుదనం చేకూరుతుంది. ముఖానికి మేకప్ అవసరం రాదు.
- వాతావరణ కాలుష్యం, ఎండ, దుమ్ము, ధూళి వల్ల ముఖం మీద మొటిమలు, మచ్చలు, దద్దులు, ట్యానింగ్ లాంటి సమస్యలు ఏర్పడుతుంటాయి. అలాంటప్పుడు బయటి నుంచి రాగానే ముఖాన్ని గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుని కొద్దిగా పేరిన నెయ్యి రాసుకుంటే చాలు. మునుపటి నిగారింపు వచ్చేస్తుంది. నెయ్యిలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మాన్ని సంరక్షిస్తాయి.
- రోజూ రాత్రి పడుకునేముందు ముఖానికి నెయ్యి రాసుకుంటూ ఉంటే చర్మం తేమతో నిండుతుంది. ముఖం ఛాయగా మెరుస్తుంది కూడా.
- చిన్న గిన్నెలో ఒక చెంచా నెయ్యి, పావు చెంచా పసుపు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చూపుడు వేలితో కొద్ది కొద్దిగా తీసుకుంటూ ముఖానికి పట్టించాలి. పావుగంటసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుంటే ముఖం ప్రకాశవంతంగా కనిపిస్తుంది.

---

విభిన్నం

# బైకర్ బామ్మ..!

87 ఏళ్ల వయసులో స్కూటర్ నడపడమే కాదు, షోలే సినిమాను తలపించేలా చెల్లిని వెంటేసుకుని మరీ రయ్యిన దూసుకుపోతున్నారు అహ్మదాబాద్‌కు చెందిన **మందాకినీ షా**. మహిళా మండళ్లు, పంచాయితీ సమావేశాలతో నిరంతరం బిజీ బిజీగా ఉండే మందాకిని, సమాజ సేవ గురించీ, స్కూటర్‌తో ఏర్పడిన అనుబంధం గురించి ఇలా వివరిస్తున్నారు...



"నా పేరు మందాకినీ షా. నాకు 87 ఏళ్లు. చెల్లెలు ఉషతో కలిసి, స్కూటర్ మీద చక్కర్లు కొట్టడమంటే నాకు చాలా ఇష్టం. నేను అహ్మదాబాద్‌లోనే పుట్టి పెరిగాను. మేం ఐదుగురం అక్కాచెల్లెళ్లం. మాకొక తమ్ముడు కూడా ఉన్నాడు. అందర్లోకీ నేనే పెద్దదాన్ని కాబట్టి జీవితపాఠాలను ఎంతో ముందుగానే నేర్చేసుకున్నాను. స్వాతంత్రసమరయోధుడైన నాన్న, నా చిన్నతనంలో ఏదో ఒక వ్యాపారంలో స్థిరపడాలని పరితపించేవారు. కానీ అందుకు సరిపడా డబ్బు మా దగ్గర ఉండేది కాదు. దాంతో వ్యాపారం చేయలేకపోయారు. అమ్మ ఎంతో కష్టపడి మమ్మల్ని పెంచింది. ఆమె కష్టాన్ని చూస్తూ పెరిగానేమో, వీలైనంత త్వరగా నా కాళ్ల మీద నేను నిలబడాలని నిర్ణయించుకున్నాను. అందుకే కాలేజీ చదువు వద్దనుకుని, బడి చదువు పూర్తవగానే ఉద్యోగంలో చేరిపోయాను. అలా 16వ ఏట బాలమందిర్‌లో టీచర్‌గా పని చేయడం మొదలుపెట్టాను.

### సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటూ..

నాకు ఇంగ్లీషు అంతగా రాదు. కానీ జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదల బలంగా ఉండేది. దాంతో సమాజ సంక్షేమ పథకాల్లో చేరిపోయాను. మహిళా మండళ్లను కలుస్తూ, పంచాయితీ సమావేశాల్లో పాల్గొంటూ మహిళా హక్కుల గురించి బోధించడం మొదలుపెట్టాను. అలా దుమ్ము లేచే రోడ్ల మీద వేర్వేరు చోట్లకు ప్రయాణాలు చేసే క్రమంలో, స్కూటర్, జీప్ నడపడం నేర్చేసుకున్నాను. ఆ తర్వాత ఒక సెకండ్ హ్యాండ్ స్కూటర్ కొనుక్కున్నాను. స్కూటర్ చేతిలో ఉంటే, ప్రయాణాలకు వెనకాడే పరిస్థితి ఉండదు. అయితే పెద్ద వయసులో ఒక మహిళ స్కూటర్ నడపడమన్నది ఆశ్చర్యకరమైన విషయమే! అందరూ వింతగా చూసేవారు. అక్కడితో ఆగితే ఫరవాలేదు. చాలా ఏళ్ల పాటు నన్నొక ప్రశ్నతో ఇబ్బంది పెట్టారు.

### 16 ఏళ్ల యువతిలా...

'మీకు పెళ్లి కాలేదా? మీరు విధవా?' అనే వాళ్ల ప్రశ్న నన్ను చాలా కాలం ఇబ్బంది పెట్టింది. వాళ్లకు.. ఒక ఒంటరి మహిళ, ముగియని కథ లాంటిది. కానీ నిజానికి నా కథ కాస్త ఆలస్యంగా మొదలైందనే విషయం వాళ్లకు తెలియదు. ఒకానొక సందర్భంలో నేను కూడా పెళ్లి చేసుకోవాలనుకున్నాను. కానీ మనం అనుకున్నట్టు సాగితే అది జీవితం ఎలా అవుతుంది? అందుకే జీవితంతో రాజీ పడిపోయాను. ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికీ... 'అమ్మా మీరు స్కూటర్ ఎందుకు నడుపుతున్నారు?' అని అడుగుతూ ఉంటారు. ఆ ప్రశ్నకు చిరునవ్వే నా సమాధానం. స్కూటర్ నడుపుతున్నప్పుడు ముఖాన్ని స్పృశించే గాలి, నన్ను 16 ఏళ్ల యువతిననే భావనకు లోను చేస్తుందని ఎంతమందికి చెప్పను? వయసు నాలో సత్తువను తగ్గిస్తూ ఉండవచ్చు. కానీ మనసులో పట్టుదలను సడలించలేకపోయింది. నేనిప్పటికీ చెల్లి ఉషను వెంటబెట్టుకుని వేర్వేరు ఊర్లు తిరుగుతూ ఉంటాను. ప్రతిరోజూ స్నేహితులను కలుసుకుంటూ ఉంటాను. ఆటపాటలతో కాలక్షేపం చేస్తూ ఉంటాను. 80ల్లో ఉన్నాను కాబట్టి ఇక్కడితో నా కథ కంచికే అనుకుంటే పొరపాటు, సమాజం ఊహించని జీవితం జీవించాను. నా కథ ముగియడానికి ఇంకా ఎంతో సమయం మిగిలిఉంది."

# రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం

**● జిల్లాలో రైతన్నా-మీకోసం వారోత్సవాలు**

కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. మంగళవారం జిల్లాలో పలు చోట్ల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతన్నా-మీకోసం వారోత్సవాలను అధికారులు, కూటమి నాయకులు నిర్వహించారు.



గుర్ల: పాలవలసలో రైతుకు కరపత్రం అందజేస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

●డెంకాడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా రైతులు అధిక దిగుబడి సాధించి లాభాలు పొందాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు. మండలంలోని పెదతాడివాడలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతన్నా-మీకోసం వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంది చంద్రశేఖరరావు, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, భాస్కరరావు, ఏవో టి.సంగీత, ఏఈవో రామకోటి పాల్గొన్నారు.

●వంగర, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):రైతులకోసం ప్రభుత్వం అండగా ఉంటుందని, సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి ఆదుకుంటుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. కింజంగిలో నిర్వహించిన రైతన్నా-మీకోసం కార్యక్రమంలో కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొత్స వాసుదేవరావు, పైల వెంకటరమణ, ఎల్.కృష్ణమూర్తి, ధనలక్ష్మి, మోహన్‌రావు, దుర్గారావు, రమేష్ పాల్గొన్నారు.

●విజయనగరం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు. మంగళవారం గొల్లలపేటలోని రైతన్నా-మీకోసం కార్యక్రమంలో భాగంగా రైతులకు సీఎం చంద్రబాబు రాసినలేఖలను అందజేశారు. ధాన్యం కొనుగోళ్లపై రైతులను అడిగి తెలుసుకున్నారు.




విజయనగరం రూరల్: సీఎం చంద్రబాబు రైతులకు రాసిన లేఖను అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

●గుర్ల, నవంబరు25(ఆంధ్రజ్యోతి):రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పాటుపడుతోందని టీడీపీ రాష్ట్రకార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు తెలిపారు. మండలంలోని పాలవలస, గూడెం గ్రామాల్లో రైతన్నా-మీకోసం కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి వి.సన్యాసినాయుడు, సొసైటీ అధ్యక్షులు కిరణ్‌కుమార్‌రాజు, బీసీ సెల్ నాయకులు మండల అప్పలనాయుడు పాల్గొన్నారు.

## 11 మందిపై బైండోవర్ కేసుల నమోదు

దత్తిరాజేరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్టుషాపుల కేసుల్లో పట్టుబడిన 11 మందిని మంగళవారం తహసీల్దార్(ఎస్ఈసీ) హరికిరణ్ ఎదుట హాజరుపరచి బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ జనార్దనరావు తెలిపారు. ఈమేరకు 11 మందిపై సంవత్సర కాలపరిమితికి రూ.రెండు లక్షల బాండును సమర్పించి బైండోవర్ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు పి.నరేంద్రకుమార్, పి.శాంతిలక్ష్మి, హెచ్‌సీలు ఎండీజే భాషా, పీబీఎస్‌వీఆర్ రాజులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

విజయనగరం క్రైం, నవంబరు 25 ( ఆంధ్రజ్యోతి): విజయనగరం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్‌ఐ అశోక్‌కుమార్ సిబ్బంది చేపట్టిన తనిఖీల్లో తొమ్మిది మంది మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వీరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా విజయనగరం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ విద్య ఎనిమిది మంది నిందితులకుగాను ఒక్కొక్కరికి రూ.పది వేలు జరిమానా, ఒకరికి ఐదు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు.

**ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో..**

ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, ఎస్‌ఐ భాస్కరరావు, సిబ్బంది చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్ కేసులో తనిఖీల్లో 18 మంది పట్టుబడ్డారు. వీరికి మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టగా విజయనగరం అదనపు జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎంఎస్‌హెచ్‌ఆర్ తేజచక్రవర్తి 17 మంది నిందితులకుగాను ఒక్కొక్కరికి రూ. పదివేలు చొప్పున జరిమానా, ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు.

**14 రోజుల జైలు శిక్ష..**

వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో సీఐ ఆర్‌వీఆర్‌కే చౌదరి, సిబ్బంది చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్ కేసు తనిఖీల్లో కణపాకకు చెందిన పడగల అజయ్ మద్యం సేవించి పట్టుబడ్డాడు. మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టగా విజయనగరం అదనపు జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎంఎస్‌హెచ్‌ఆర్ తేజచక్రవర్తి 14 రోజుల జైలు శిక్షతో పాటు రూ. పది వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు.

**ముగ్గురికి జైలు ..**

వంగర, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి పాలకొండ న్యాయాధికారి జైలు శిక్ష విధించారని ఎస్‌ఐ షేక్ శంకర్ తెలిపారు.మడ్డువలస వద్ద రేగిడి,వంగరకు చెందిన నలుగురు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా అరెస్టుచేసి పాలకొండ కోర్టుకు తరలించినట్లు చెప్పారు. న్యాయాధికారి ఒకరికి 10 రోజులు, ఇద్దరికి ఐదు రోజులతోపాటు మరొకరికి రూ.10 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు.

**రూ. పది వేలు జరిమానా**

రాజాం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):మద్యం సేవించి కారు నడిపిన వ్యక్తికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ న్యాయాధికారి నైమిష మంగళవారం తీర్పువెలువరించారు. రేగిడి ఎస్‌ఐ బాలకృష్ణ కథనం మేరకు.. రేగిడిఎస్‌ఐ ఆధ్వర్యంలో పోలీసులునిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీలో పాలకొండకు చెందిన ముద్దాడ శ్రీను మద్యం సేవించి కారు నడుపుతూ పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి రాజాం న్యాయస్థానంలో మంగళవారం హాజరుపరచగా రూ.10 వేలు జరిమానా విధించారు.

**మూడు రోజులు..**

సంతకవిటి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలీసులు సోమవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా రేగిడి ఆమదాలవలస మండలంలోని వండానపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డాడు. ఈ మేరకు రాజాం జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా మూడు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ ఆర్.గోపాలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి: వీసీ

విజయనగరం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాలు పెంచేందుకు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యాలను తీర్చిదిద్దాలని జేఎన్‌టీయూ వీసీ వీవీ సుబ్బారావు కోరారు. మంగళవారం జేఎన్‌టీయూలో ఫార్మాసూటికల్ సైన్సెస్ కళాశాల ఆధ్వర్యంలో ఉత్తరాంధ్రలోని ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యక్ష, ప్రాదేశిక అనుభవం, పరిశ్రమ- విద్యా సంస్థల భాగస్వామ్యం బలోపేతం చేయాలని కనీసం రెండు నెలల శిక్షణ కార్యక్రమాలు అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జయసుమ పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

నెల్లిమర్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. మంగళవారం మండలంలోని జోగిరాజుపేట, మధుపాడ గ్రామాల్లో మన ప్రజలతో-మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు



రాజాం: ఫుట్‌పాత్‌పై ఆక్రమణను తొలగిస్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని చీపురుపల్లి రోడ్డులో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను కమిషనర్ ఎ.రామచంద్రరావు మంగళవారం తొలగింపు పనులు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో ఇటీవల ఫుట్‌పాత్‌పై అక్రమ నిర్మాణాలు శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో కమిషనర్ స్పందించారు. ఈ మేరకు షాపుల యజమానులను ఆక్రమణలపై ప్రశ్నించారు. వారు ముందుకురాకపోవడంతో నేరుగా కమిషనర్ చర్యలు తీసుకొని నిబంధనల ప్రకారంతొలగించే చర్యలు చేపట్టారు. ఆయనతో పాటు పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారి శాస్త్రి ఉన్నారు.

**నిధుల లేమితో స్వచ్ఛరథాల నిలిపివేత**

రేగిడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాడ, వావిలవలసలో చెత్త సేకరణకు సంబంధించిన స్వచ్ఛరథాలను పంచాయతీల్లో నిధులకొరతతో నిలిపివేసినట్లు సర్పంచ్, కార్యదర్శులు వివరణ ఇచ్చినట్లు డిప్యూటీ ఎంపీడీవో జగన్నాథరావు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఈనెల 24న అటకెక్కిన 'స్వచ్ఛరథాలు' శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో జిల్లాయంత్రాంగం ఆదేశాల ప్రాప్తికి చీపురుపల్లి డివిజనల్ డవలప్‌మెంట్ అధికారి హేమసుందర్ ఎంపీడీవో శ్యామలాకుమారి, డిప్యూటీ ఎంపీడీవో జగన్నాథరావును వివరణ కోరారు. దీంతో వారు వాహనాలు నిలిపివేతకు గల కారణాలను మంగళవారం అంబాడ సర్పంచ్ చుక్కా వెంకటనాయుడు, అంబాడ, వావిలవలస కార్యదర్శులు శ్యామ్‌సుందర్‌రావు, వేణును అడిగి తెలుసుకున్నారు. నిలిపివేతకు గల కారణాలు రాతపూర్వకంగా ఇవ్వాలని ఎంపీడీవో తెలియజేశారు.

# ఎట్టకేలకు రోవర్ లభ్యం

**● ఈ ఏడాది ఏప్రిల్‌లో మాయం**

**● రాజాం మునిసిపల్ కార్యాలయంలోనే ఉందని ప్రకటన**

రాజాం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భూ సర్వేకు ఉపయోగించేందుకు వీలుగా ప్రభుత్వం సరఫరా చేసిన రూ.పది లక్షల విలువచేసే రోవర్ ఎట్టకేలకు లభ్యమయ్యిందని మునిసిపల్ కార్యాలయవర్గాలు మంగళవారం తెలిపాయి. వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో అట్టపెట్టెలో దొరికినట్లు స్పష్టం చేశాయి. గతంలో ఇక్కడ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసి కొన్నేళ్ల తరువాత భీమవరం మునిసిపాలిటీకి బదిలీపై వెళ్లిన కమిషనర్ హయాంలో రోవర్‌తోపాటు ట్యాబ్‌లు కూడా అదృశ్యమైనట్లు అప్పట్లో విమర్శలొచ్చాయి. ఈ విషయాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 25న రాజాం మునిసిపాలిటీలో రోవర్ మిస్సింగ్ శీర్షికన ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. దీంతో అప్పటి కమిషనర్ రామఅప్పలనాయుడు రోవర్ మిస్సింగ్ వాస్తవమేనని, ఇందుకు బాధ్యులైన సచివాలయ సిబ్బందికి నోటీసులిచ్చినట్లు ఈ ఏడాది ఏప్రిల్ చివరివారంలో ప్రకటించారు. అక్కడితో ఆగకుండా అదృశ్యమైన రోవర్ నెల్లిమర్ల నగర పంచాయతీలో ఉందని ఇక్కడి మునిసిపల్ వర్గాలు మరోమారు ప్రకటించాయి. ఈ ప్రకటనతో తేరుకున్న నెల్లిమర్ల నగరపంచాయతీ కమిషనర్ తదితరులు తమవద్ద ఎటువంటి రోవర్ లేదని, తమ కార్యాలయానికి ఎవరూ రోవర్ ఇవ్వలేదని ప్రకటించారు. దీంతో ఎవరి హయాంలో రోవర్ మిస్ అయ్యిందో ఆ కమిషనర్, సర్వేయర్, సచివాలయ సిబ్బందే బాధ్యులని అప్పటి మునిసిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు మునిసిపల్ పరిపాలనా విభాగానికి వివరించారు. కాగా ఆర్నెళ్ల తర్వాత మంగళవారం రోవర్ మునిసిపల్ కార్యాలయంలోనే ఉందని ప్రకటించారు. లభ్యమైన రోవర్‌ను ప్రస్తుత మునిసిపల్ కమిషనర్ రామచంద్రరావు పరిశీలించారు. లక్షలాది రూపాయల విలువచేసే రోవర్‌కు రక్షణ కల్పించడంలో మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## డ్రగ్స్ నిర్మూలనను సహకరించాలి

**● మాదకద్రవ్యాల నియంత్రణ కోసం పోలీసులు అభ్యుదయ సైకిల్ ర్యాలీ**

డ్రగ్స్ నిర్మూలనను సహకరించాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం నెల్లిమర్ల నియోజకవర్గంలో మాదకద్రవ్యాల నియంత్రణ కోసం పోలీసులు అభ్యుదయ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

●డెంకాడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వాడకం ద్వారా ఎన్నో కుటుంబాలు నాశనం అవుతున్నాయని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆందోళన వ్యక్తంచేశారు.మండలంలోని పెదతాడివాడ మెర్సీ మిషన్ స్కూల్‌నకు మాదకద్రవ్యాల నియంత్రణ కోసం పోలీసులు చేపట్టిన అభ్యుదయ సైకిల్ ర్యాలీ మంళవారం ఉదయం తొమ్మిది గంటలకు చేరుకోగా ర్యాలీని ఎమ్మెల్యే నాగమాధవి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడుల ఆధ్వర్యంలో విద్యార్థుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పల్సర్‌బైక్ రమణ గంజయి, మాదక ద్రవ్యాలపై గీతాన్ని ఆలపించి అందరికి అర్థమయ్యే రీతిలో మాదకద్రవ్యాల వల్ల జరిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో నెల్లిమర్ల టీడీపీ నాయకులు కంది చంద్రశేఖరరావు, భాస్కరరావు, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, పాణిరాజు, జనసేన నాయకులు లక్ష్మిరాజ్, , పైల శంకర్, పిన్నింటి రాజారావు పాల్గొన్నారు.



డెంకాడ: సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

● భోగాపురం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు అలవాటు పడి సంబంధిత కేసులో పట్టుబడి అరెస్టైతే జీవితం నాశనం అవుతుందని సీఐ కె.దుర్గాప్రసాదురావు తెలిపారు.మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన సైకిల్ ర్యాలీ భోగాపురం పంచాయతీ కార్యాలయానికి చేరుకుంది.కార్యక్రమంలో ఎస్‌ఐ వి.పాపారావు, పోలీస్ సిబ్బంది, ఎంఈవో-2 చంద్రమౌళి, నాయకులు కొమ్మూరుసుబోషణరావు, పల్లంట్ల జగదీష్, ఆళ్లశ్రీనివాసరావు, గుండపు సూరిబాబు, మాతా నవీన్ పాల్గొన్నారు.

●పూసపాటిరేగ,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): పూసపాటిరేగలో మాదకద్రవ్యాల నిర్మూలనపై పోలీసులు అభ్యుదయ సైకిల్‌యాత్ర నిర్వహించారు. ఎస్‌ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో పాటు విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

## యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం: ఎమ్మెల్యే

రాజాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ ముందుకు సాగుతున్నారని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. మంగళవారం రాజాంలోని శ్రీకాకుళంరోడ్డులోగల బ్యాంకు ఆఫ్ ఇండియా వెనుక ఏర్పాటుచేసిన బాక్స్ క్రికెట్‌ను ప్రారంభించారు. అనంతరం, గృహనిర్మాణ, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షించారు. కొత్తవలసలో సిమ్మెంట్‌రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారికి సకాలంలో బిల్లులు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా విద్యుత్ సమస్య ఏర్పడితే తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు శాసపు రమేష్‌కుమార్, పొట్నూరు లక్ష్మణరావు, మరిపి జగన్మోహనరావు, పిల్లా సత్యంనాయుడు, నల్ల శ్రీనివాసరావు, కొంపిల్లి రవీంద్ర, కోటి, ఏడీఈ రెడ్డి తిరుపతిరావు, ఏఈ కుమార్,డీఈఈ రత్నకర్, ఏఈలు రాజమోహన్‌రావు, దుర్గారావు పాల్గొన్నారు, అలాగే శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో ఎనిమిది మందికి సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

## ఉత్సాహంగా నమూనా ఎన్నికలు

కొత్తవలస, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణపై మంగళవారం దెందేరు జడ్పీ హైస్కూల్‌లో నమూనా ప్రక్రియను నిర్వహించి... విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ పనితీరుతో పాటు పార్లమెంట్ నుంచి పంచాయతీ వరకు ఎన్నికలు ఎలా నిర్వహిస్తారో తెలియజేశారు. ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, ప్రచార కార్యక్రమం, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. బ్యాలెట్ పేపర్, ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి? ఓటు ఎలా వేయాలి? ఓట్ల లెక్కింపు, విజయం సాధించిన అభ్యర్థుల ప్రకటన, ధ్రువీకరణ పత్రం అందజేత వరకు పూర్తిగా నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా కొందరు విద్యార్థులను నియమించారు. ఈ ప్రక్రియలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఇన్‌చార్జి హెచ్‌ఎం జి.రవికుమార్, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.




బ్యాలెట్ బాక్స్‌లో ఓటు వేస్తున్న విద్యార్థి

## ఆకుపై రాజముద్ర

కొత్తవలస, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలోని దెందేరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాజ్యాంగ దినోత్సవం పేరును, రాజముద్రను పెద్ద ఆకుపై అందంగా చిత్రీకరించారు. ఈ బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. డ్రాయింగ్ ఉపాధ్యాయుడు జీఎంజీ పరమేశ్వరరావు పర్యవేక్షణలో ఈ చిత్రాన్ని ఆకుపై విద్యార్థినులు చిత్రీకరించారు. గ్రామస్థులు కూడా వీటిని తిలకించి.. విద్యార్థులను అభినందించారు.

రాజ్యాంగ దినోత్సవం పేరు, రాజముద్ర




## నెమలి పింఛంతో అమ్మవార్లకు అలంకరణ

భోగాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుడివాడ గ్రామదేవతలు ముత్యాలమ్మతల్లి, తోగాలమ్మతల్లి అమ్మవార్లకు భక్తులు మంగళవారం నెమలి పింఛంతో పాటు నెమలి పింఛాన్ని పోలిన వస్త్రంతో అలంకరించారు. అమ్మవార్లకు చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. గ్రామంలో వెలసిన ఈ అమ్మవార్లను భక్తులు ప్రతివారం ప్రత్యేకంగా అలంకరించి.. విశేష పూజలు చేస్తారు. ఈ క్రమంలో మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్ల దర్శనానికి తరలివచ్చారు. పూజలు చేసి..మొక్కుబడులు చెల్లించుకున్నారు.



తోగాలమ్మ విగ్రహాన్ని అలంకరించిన దృశ్యం

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గుర్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని చీపురుపల్లి సీఐ శంకరరావు సూచించారు. తెట్టంగి జడ్పీ హైస్కూల్‌లో మత్తుపదార్థాల వాడకం, చట్టాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## రొయ్యల దొంగతనంపై కేసు నమోదు

భోగాపురం, నవంబరు25(ఆంధ్రజ్యోతి): రామయంద్రపేట సమీపంలోగల రొయ్యల చెరువులో రొయ్యలు దొంగతనం జరిగాయని నిర్వాహకుడు కామేశ్వరరావు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు సీఐ కె.దుర్గాప్రసాదురావు తెలిపారు. ఈనెల 24 వేకువ జామున చెరువులో పెంచుతున్న రొయ్యలను ముగ్గురు వ్యక్తులు వలలతో పట్టి దొంగతనం చేశారని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## యువతి అదృశ్యం

భోగాపురం, నవంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి (21)అదృశ్యమైనట్లు తల్లి హేమలత ఫిర్యాదు చేసిందని సీఐ దుర్గా ప్రసాదురావు మంగళవారం తెలిపారు. వెంకటలక్ష్మి డిగ్రీ వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటోందని చెప్పారు. అయితే హేమలత బయటకి వెళ్లి మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి కుమార్తె లేకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని చెప్పారు. ఈమేరకు ఫిర్యాదుచేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్యస్వామి షష్టి

రాజాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచరాంలో పూర్ణ పుష్కలాంబ సమేత హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయ ధర్మకర్త టంకాల పాపినాయుడు గురుస్వామి ఆధ్వర్యంలో వల్లిదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర సామి ఆలయంలో షష్టి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల కావళ్లతో కర్పూర హారతులతో విశేష ఊరేగింపు కార్యక్రమం జరిపారు.

●రేగిడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపెంపేటలో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు వేమకోటి ప్రసాదరావు శర్మ ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో సోమవారం నుంచి పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

**నేడు సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం**

శృంగవరపుకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పుణ్యగిరి రోడ్డులోని దారగంగమ్మ ఆలయ ఆవరణలో బుధవారం సుబ్రహ్మణ్యస్వామి షష్టి కల్యాణం నిర్వహించనున్నారు. దేవదాయ శాఖ ఈవో కె.నాగేంద్ర, ప్రధాన అర్చకులు ఆచార్య ఎ.రాజగోపాల్‌లు కల్యాణానికి వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



రాజాంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఊరేగిస్తున్న గురుస్వామి, భక్తులు

## రేపు నెల్లిమర్లలో జాబ్‌మేళా

నెల్లిమర్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని బీవీఆర్ ఒకేషనల్ కాలేజీలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నెల్లిమర్ల బీవీఆర్ ఒకేషనల్ కాలేజీ సంయుక్తంగా గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి భాస్కరరావు మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాకు 11 బహుళజాతి కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణత సాధించిన 18 నుంచి 35 సంవత్సరాల విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

## మండల బడ్జెట్ ఆమోదం

గుర్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. మంగళవారం ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిధుల ఖర్చుల వివరాలను ఎంపీడీవో రవికుమార్ చదివి వినిపించారు.కార్యక్రమంలో జడ్పీటీసీ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ తిరుపతిరావు, ఏవో వరప్రసాద్ పాల్గొన్నారు.

## వంద మందికి సరుకుల పంపిణీ

విజయనగరం రూరల్, నవంబరు 25 ( ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని కణపాక ఆగురువీధి మారుతీ స్వయం సేవా సంఘం ఆధ్వర్యంలో 100 మంది నిరుపేద మహిళలకు నిత్యావసరాలు, చీరల వ్యాపారులు ఆడారి వెంకటేశ్వరరావు, నాగమల్లి గణపతిరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గుత్తూరు చంద్రశేఖర రావు, అప్పలస్వామి, తులసీరామ్ పాల్గొన్నారు.

## కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

రాజాం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.26 వేలు కనీసవేతనంగా ఇవ్వాలని, పనిఒత్తిడి తగ్గించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘ నాయకుడు రామ్మూర్తినాయుడు కోరారు. రాజాం ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.

## ఉనికి కోసమే వైసీపీ నేతల విమర్శలు

**● భోగాపురం ఎయిర్‌పోర్టు కోసం మాట్లాడడం సిగ్గుచేటు**

**● టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున**



మాట్లాడుతున్న నాగార్జున

విజయనగరం రూరల్, నవంబరు 25 ( ఆంధ్రజ్యోతి): ఉనికి కాపాడుకోవడం కోసమే ప్రభుత్వంపై వైసీపీ నేతలు విమర్శిస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తెలిపారు. మంగళవారం విజయనగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు సకాలంలో జరుగుతున్నాయన్నారు. 24 గంటలు తిరగక ముందే రైతుల ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయన్నది వాస్తవమా కాదా అన్నది వైసీపీ నేతలు చెప్పాలన్నారు. మొక్కజొన్న కొనుగోళ్లు కూడా సకాలంలో సాగుతున్నాయన్నారు. రైతుల సంక్షేమానికిప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. భోగాపురంలో నిర్మిస్తున్న ఎయిర్‌పోర్టు కోసం వైసీపీనేతలు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఎయిర్‌పోర్టు విషయంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ నేతల మాటలు ద్వంద్వ వైఖరిని తలపిస్తున్నాయన్నారు. ప్రతిపక్షంలో ఒక మాట, అధికారంలోకి రాగానే మరోమాట మాట్లాడుతున్నారని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు ముద్దాడ చంద్రశేఖర్, ఆల్తి బంగారుబాబు, కంది మురళీనాయుడు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పక్కా ఇళ్లు: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద అర్హులందరికీ పక్కా ఇళ్ల మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఒకప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని గ్రామాల్లో అర్హత ఉండి ఇల్లు లేని నిరుపేదల కోసం 100 శాతం డిమాండ్‌తో సర్వే జరుగుతుందని తెలిపారు. పేర్లు నమోదు చేసుకోవడానికి ఈ నెల 30 వరకూ మాత్రమే గడువు ఉందని పేర్కొన్నారు.రానున్న ఐదేళ్లల్లో ఎవరికైనా ఇల్లు కావాలంటే ఈనెలాఖరులోగా తప్పసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు.

## మహిళలను హింసకు గురిచేస్తే చర్యలు

రాజాం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలను హింసకు గురిచేయడం చట్టరీత్యా నేరమని, అలా ఎవరైనా వ్యవహరిస్తే అటువంటి వారిపై చట్టప రమైన చర్యలు తప్పవని మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఫ్లోరెన్స్‌నైటింగేల్ నర్సింగ్ కళాశాలలో మహిళలపై హింస నిర్మూలనకు అంతర్జాతీయ దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన సదస్సులో జూనియర్ న్యాయాధికారి నైమిషతో కలిసి శారదాంబ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి

## ఇన్‌చార్జిలతో ఇంకెన్నాళ్లు?

(ఐదో పేజీ తరువాయి)

ఉన్నతాధికారులకే తెలియాలి. ● ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జగనన్న కాలనీ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేని వారికి అదనపు సహాయాన్ని అందించింది. పీవీటీజీలకు రూ.లక్ష , ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేల చొప్పున సాయం అందించారు. మొత్తంగా జిల్లాలో 3,618 మంది గృహ నిర్మాణ లబ్ధిదారులకు రూ.8.32 కోట్లు అందించారు. అయితే వారిలో కేవలం 88 మంది మాత్రమే శ్లాబ్ లెవెల్ వరకు గృహ నిర్మాణాలు చేపట్టారు. అదనపు సహాయం పొందినా చాలా మంది పనులు పూర్తి చేయలేకపోయారు. హౌసింగ్ శాఖలో అధికారుల కొరత, పర్యవేక్షణ లోపం ఇందుకు కారణమనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిసిస్తున్నాయి.

**వారికి న్యాయం జరిగేదెప్పుడు?**

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 4,030 మందికి ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరు చేశారు. వివిధ దశల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి రూ.36.37 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది. అప్పట్లో 24.20 కోట్ల వరకూ చెల్లించారు. ఇంతలోనే ఎన్నికలు జరగడం. వైసీపీ అధికారంలోకి రావడంతో సీన్ మారింది. ఎన్టీఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారులకు వైసీపీ సర్కారు బిల్లులు చెల్లించలేదు. దీంతో ఇళ్ల నిర్మాణాలు కూడా ముందుకు సాగని పరిస్థితి. ప్రస్తుతం ఈ లబ్ధిదారులంతా కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

## ఫోన్ వద్దు.. పుస్తకం ముద్దు

(ఐదో పేజీ తరువాయి)

ఆదేశించారు. మంగళవారం మెప్మా, డీఆర్డీఏ ఆధ్వర్యంలో జెండర్ సమానత్వం కోసం చేపట్టిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. జెండర్ సమానత్వంపై పాఠశాల, కళాశాలల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

**ఈవీఎం గోదాము పరిశీలన**

పార్వతీపురం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న ఈవీఎం గోదామును కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా అక్కడ పరిస్థితిని గమనించారు. గోదాముకు వేసిన సీళ్ల, ఈవీఎంల రక్షణ, భద్రతను పరిశీలించారు. పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఆర్వో కె.హేమలత, తహసీల్దార్ ఎం.సురేష్ తదితరులు ఉన్నారు.

## పంట పొలాల్లోనే వరి కుప్పలు



గరుగుబిల్లిలోని పొలాల్లో వరి కుప్పలు

గరుగుబిల్లి, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాల్లోనే వరి కుప్పలు దర్శనమిస్తున్నాయి. తుఫాన్ ప్రభావం ఉందన్న హెచ్చరికలతో రైతులు కోత కోసిన పంట వర్షాల బారిన పడకుండా ఉండేలా రైతులు అవసరమైన చర్యల్లో బిజీగా ఉన్నారు. గతంలో నెలకొన్న మొంథా తుఫాన్ ప్రభావంతో వరి పంటకు కొంతమేర నష్టం వాటిల్లింది. మిగిలిన పంటను కుప్పలుగా వేసుకున్నారు. కొన్నిచోట్ల తేలిక రకం వరి పంటను యంత్రాల సహాయంతో నూర్పులు చేసి ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తరలించే చర్యలు చేపడుతున్నారు. ఇదిలా ఉండగా మండలానికి సంబంధించి కొందరు రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు చెల్లించకపోవడంతో ధాన్యం కొనుగోలు నత్తనకడన సాగుతోంది. ధాన్యం తరలించలేని పరిస్థితి ఏర్పడింది.

**ముందస్తు జాగ్రత్తల్లో అన్నదాతలు**

●వీరఘట్టం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో రైతులు పంట రక్షణకు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. పంట పొలాల్లో వరిచేనును కుప్పలుగా వేస్తున్నారు. వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో తుపాను వస్తే తీవ్ర నష్టం ఎదుర్కోవాల్సిన ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## వలసబల్లేరులో 'రైతన్నా మీకోసం'

కురుపాం రూరల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): వలసబల్లేరులో మంగళవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు రైతులకు సాగులో మెలకువలు, ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలు, ఆర్‌డీఎస్ పద్ధతిలో 25 రకాల విత్తనాలు వేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

●సీతంపేట రూరల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): పులిపుట్టి, పెద్దగూడ, జగతిపల్లి, శిలగాం, చినబగ్గ, మర్రిపాడు, కడగండి, కుసిమి, దోనుబాయి, పనుకువలస పంచాయతీల్లో మంగళవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వాహిని రైతులకు పంచ సూత్రాలపై అవగహన కల్పించారు.

●వీరఘట్టం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలో మంగళవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సౌజన్య రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## టెట్ నిర్వహణపై పార్లమెంట్‌లో చర్చించాలి

బొబ్బిలి, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నిర్వహణకు సంబంధించి పార్లమెంట్‌లో చర్చించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జిల్లా ఏపీటీఎఫ్ నేత ప్రసన్నకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పై జాతీయ స్థాయి ఉద్యమాలను చేపడతామన్నారు. ఉపాధ్యా యులకు టెట్ తప్పనిసరి అని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై చాలా రాష్ట్రాలు రివ్యూ పిటీషన్ వేశాయన్నారు. ఏపీ ప్రభుత్వం రివ్యూపిటీషన్ దాఖలు చేయడానికి మీనమేషాలు లెక్కించడం అన్యాయమన్నారు. విద్యారంగసమస్యలకు సంబంధించి అన్ని డివిజన్ కేంద్రాలలో డిసెంబరు 9, 10 తేదీల్లో, జిల్లా కేంద్రంలో డిసెం బరు 18న నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. జనవరి మొదటివారంలో రాష్ట్రస్థాయిలో నిరసనలుంటాయి. జనవరి 29న ఎన్ఈపీ రద్దు చేయాలని, టెట్‌ను విరమించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఆందోళన చేపడతామన్నారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు రమేష్, సత్యనారాయణ, సుధాకర్, శంకరరావు, చిట్టి బాబు, చంటి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు

**● ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి**





రైతన్నా మీ కోసంలో ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సాగుతో పంట దిగుబడులు సాధించవచ్చునని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. తద్వారా ఆర్థికంగా బలోపేతం కావచ్చునన్నారు. మంగళవారం పెద్దఖేర్జ గ్రామంలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు, ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ కడ్రక కళావతి, మండల పార్టీ అధ్యక్షుడు అడ్డాకుల నరేష్, కూటమి నాయకులు నిమ్మక సింహాచలం, మండంగి భూషణరావు, వెంపటాపు భారతమ్మ, శంకరరావు, తాడంగి లక్ష్మణరావు, పాలక క్రాంతికుమార్, మండంగి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలు, హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయాధికారి హరిప్రియ

పాలకొండ, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): చట్టాలు, హక్కులపై మహిళలు అవగాహన పెంచుకోవాలని న్యాయాధికారి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షురాలు చందక హరిప్రియ సూచించారు. మంగళవారం అంతర్జాతీయ మహిళలపై హింసా నిర్మూలన దినం సందర్భంగా పాలకొండ సబ్‌కోర్టులో న్యాయాధికారి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను మానసికంగా, శారీరకంగా హింసించడం చట్టరీత్యా నేరమన్నారు. అందుకు కఠిన శిక్షలు తప్పవన్నారు. మహిళలపై హింసా నిర్మూలనపై కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా గృహహింస చట్టం, వర కట్న నిషేధిత చట్టం తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వెంకటేశ్వరరావు, రవి పాల్గొన్నారు.

## అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయండి



ఆర్టీసీ డిపో ఎదుట నిరసన

బెలగాం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని పెట్రోల్ బంక్‌లో జరిగిన అవినీతిలో సంబంధం లేని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.సుందరయ్యపై అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఏపీపీటీడీ నాయకుడు ఎస్.ఎస్.రావు డిమాండ్ చేశారు. మంగళవారం పార్వతీపురం ఆర్టీసీ డిపో వద్ద కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఔట్‌లెట్ పెట్రోల్ బంక్‌లో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి దోషులను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో యూనియన్ నాయకులు బాబు, వి.రాములు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం

జియ్యమ్మవలస, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): రైతు పండించే ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయ భారతి స్పష్టం చేశారు. మంగళవారం చినమేరంగిలో కో-ఆపరేటివ్ సొసైటీలో అధ్యక్షులు రెడ్డి బలరామస్వామి నాయుడుతో కలిసి ఆమె ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 22 చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయన్నారు. అన్ని చోట్ల ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు జరుగుతు న్నాయన్నారు. దళారీలను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. రైతులకు సకాలంలో బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసు కుంటోందన్నారు. కార్యక్రమంలో వట్టిగెడ్డ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎం.సత్యంనాయుడు, వైస్ చైర్మన్ ఎం.ప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ మజ్జి చంద్రమౌళి, పీఏసీఎస్ సీఈవో పోలిరాజు పాల్గొన్నారు.

**నాగూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం**

●గరుగుబిల్లి, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): నాగూరులో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొప్పుల వెలమ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు మద్దతు ధర అందించడంతో పాటు 24 గంటల్లో బ్యాంకు ఖాతాల్లోకి ధాన్యం డబ్బులు పడేటట్టు చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నిరుపేద ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం



రూ.లక్ష ఆర్థికసాయం చేస్తున్న దృశ్యం

కొమరాడ, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): పాత తొడుము గ్రామంలోని నిరుపేద తంగేళ్ల లక్ష్మి ఇంటి నిర్మాణానికి కురుపాం ఏఎంసీ డైరెక్టర్ నీరస శ్రీనివాసరావు రూ.లక్ష విరాళాలు సేకరించారు. ఆ మొత్తాన్ని ఆమెకు మంగళవారం అందజేశారు. ఆర్థిక సాయం చేసిన దాతలకు ఆమె ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ యోగిరెడ్డి, సింహాచలం నాయుడు, కూటమి నాయకులు సురేష్, అశోక్‌నాయుడు, లక్ష్మీనాయుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అకడమిక్ సామర్థ్యాల పరిశీలన

సీతానగరం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల అకడమిక్ సామర్థ్యాన్ని పరిశీలనకు మంగళవారం చర్యలు చేపట్టామని ఎంఈవో జి.సూరిదేముడు తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ ఫౌండేషన్ (లిటరసీ అండ్ న్యూమరాలజీ) బేసిక్ లైన్ టెస్ట్ లీప్ యాప్‌లో వివరాలను నమోదు చేశామన్నారు. మండలంలోని మూడు క్లస్టర్ల పరిధిలో ఉన్న 55 పాఠశాలల్లో ముగ్గురు డైట్ విద్యార్థులు, సీఆర్ఎంటీల సహకారంతో పరీక్షలు నిర్వహించామన్నారు. విద్యార్థులందరికీ లీప్ యాప్‌లో పొందుపరిచామన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సూరిదేముడు, ఎం.వెంకటరమణ, పరీక్షల పర్యవేక్షకుడు కె.అన్నారావు, సీఆర్‌సీలు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కొమరాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ కెనీలకంఠం సూచించారు. మంగళవారం వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో జండర్ సమానత్వంపై విద్యార్థులతో కొమరాడలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం సురేష్, పీఏసీఎస్ చైర్మన్ గులిపల్లి సుదర్శనరావు, వెలుగు సిబ్బంది, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టెక్నికల్ అసిస్టెంట్‌పై క్రమశిక్షణ చర్యలు

గరుగుబిల్లి, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ కె.శ్రీవిద్యపై క్రమశిక్షణ చర్యలకు ఎంపీడీవో జి.పైడితల్లి ఆదేశాలు జారీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విలేకరులతో మాట్లాడారు. టెక్నికల్ అసిస్టెంట్ కె.శ్రీవిద్యకు కేటాయించిన తోటపల్లి, చిలకాం, పెద్దూరు, వల్లరిగుడబ పంచాయతీల్లో సక్రమంగా విధులు నిర్వహించడం లేదని పలు ఫిర్యాదు అందాయన్నారు. అలాగే సమయపాలన, విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించడంతో పాటు ఉపాధి లక్ష్యాలు చేరుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సోమవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఉపాధి సిబ్బంది పనితీరుపై ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరితో పాటు పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. డ్వామా కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఆదేశాలు జారీ చేశామన్నారు.

## రుషితకు బంగారు పతకం



పతకాన్ని ప్రదానం చేస్తున్న సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు

పాలకొండ, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): సత్యసాయి సేవాసంస్థలు నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన పట్టణానికి చెందిన సెకెండియర్ విద్యార్థిని లావేటి రుషిత ప్రథమ స్థానం సాధించింది. దీంతో సోమవారం ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాల్‌లో విద్యా ర్థినికి బంగారు పతకాన్ని సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు, మిత్రులు అభినందించారు.

## దుకాణంలో చోరీ

సీతంపేట రూరల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లోని గిరిజన యువకుడు సవర శివకు చెందిన దుకాణంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. కొన్నేళ్లుగా పార్క్‌లో శివ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి దుకాణానికి తాళాలు వేసి వెళ్లాడు. మంగళవారం ఉదయం దుకాణం తెరిచి చూసేసరికి వెనుక భాగంలో సిమెంట్ రేకు పగలగొట్టిన విషయాన్ని గుర్తించాడు. దుకాణంలోని సీసీ కెమెరాను సైతం దొంగలు ధ్వంసం చేశారు. దుకాణంలో ఐస్‌క్రీమ్‌లు, తినుబండారాలతో పాటు చిల్లర సామగ్రి పోయాయని బాధితుడు తెలిపాడు. వాటి విలువ సుమారు రూ.15వేలు ఉంటుందని చెప్పాడు. దుకాణంలో చోరీ విషయం ఐటీడీఏ అధికారులకు సమాచారం అందించినట్టు తెలిపాడు. అయితే ఇటీవల సీతంపేటలో వరుసగా చోరీలు జరుగుతున్నాయి. వారం రోజుల కిందట ఓ సిమెంట్ దుకాణం షట్టర్ తాళాలు బద్దలు కొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి ప్రయత్నించారు. రాత్రి పూట పోలీసులు గస్తీ నిర్వహించక పోవడం వల్లే చోరీలు అధికమవుతున్నాయని స్థానికులు అంటున్నారు.

## నిష్పక్షపాతంగా విచారణ చేపట్టండి

సీతంపేట రూరల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏలో వైసీపీ హయంలో జరిగిన అవినీతి, అక్రమ బదిలీలు, నిధుల దుర్వినియోగంపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని దళిత ప్రజాసంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ డి.గణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం దళిత ప్రజాసంఘాల శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో సమావేశం నిర్వహించారు. ఐటీడీఏలో జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశిస్తూ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఇచ్చిన లేఖను చూపుతు మాట్లాడారు. విచారణ పారదర్శకంగా నిర్వహించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బి.ప్రభాకర్, అంబేడ్కర్ సాధన సమితి జిల్లా కన్వీనర్ టి.రమణ మాదిగ, రిజర్వేషన్‌ల పోరాట ఎమితి జిల్లా నాయకులు గోవింద్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు రాకోటి రాంబాబు, ఎ.గోపీ పాల్గొన్నారు.

## 300 క్యూసెక్కుల నీటి విడుదల

మక్కువ రూరల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): శంబర సమీపంలోగల వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ పరిధిలోని గోముఖి రిజర్వాయర్ నుంచి బుధవారం 300 క్యూసెక్కుల నీటిని అధికారులు నదిలోకి విడిచిపెట్టారు. నదిలోకి ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండటంతో నదిలోకి నీటిని విడిచిపెట్టామని ఏఈ ప్రశాంత్ తెలిపారు.

## శరత్‌కుమార్ అంత్యక్రియలు పూర్తి

కొమరాడ, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రబ్బర్‌డ్యామ్ వద్ద ముగ్గురు యువకులు గల్లంతై మృతి చెందిన ఘటనలో ఇప్పటికే ఇద్దరు అంత్యక్రియలు సోమవారం పూర్తయ్యాయి. అందులో రాయగడ శరత్ కుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దాంతో శివినిలో అంత్యక్రియలు నిర్వహించారు.

## మూడు పీఏసీఎస్‌లకు పాలక మండళ్లు

పార్వతీపురం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సీతానగరం, కాశీపేట, మరిపివలస పీఏసీఎస్‌లకు ప్రభుత్వం పాలక మండళ్లను నియమించింది. సీతానగరం పీఏసీఎస్ చైర్మన్‌గా చింతాడ సత్యనారాయణ సభ్యులుగా చప్ప కూర్మినాయుడు, పడాల తిరుపతి నియామకమయ్యారు. కాశీపేట పీఏసీఎస్ చైర్మన్‌గా తేలు కామేశ్వరరావు సభ్యులుగా వి.గుంప స్వామి, ఎం.రామారావు నియమితులయ్యారు. మరిపివలస పీఏసీఎస్ చైర్మన్‌గా జక్కు ఫకీర్‌నాయుడు సభ్యులుగా ఎం.యోగేశ్వరరావు, టి.మధులతలను నియమించారు.

## మహిళా సంఘాలు బలోపేతం కావాలి

గరుగుబిల్లి, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సంఘాల ప్రతినిధులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనల మేరకు అర్హత పొందిన సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలకై సిఫార్సు చేయాలని వెలుగు సిబ్బందిని సూచించారు. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించేలా దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఏపీఎం పి.అప్పలనాయుడు, సీసీలు బి.రామినాయుడు, సీహెచ్.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయినికి సత్కారం



ఉపాధ్యాయిని గౌరీకుమారిని సత్కరిస్తున్న హెచ్ఎం, సంక్షేమాధికారి

కురుపాం రూరల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన లంకాజోడు గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన సోషల్ అసిస్టెంట్ రవ్వల గౌరీకుమారిని మంగళవారం హెచ్ఎం అరుణ, సంక్షేమ అధికారి రేవతి సత్కరించారు. ఈ నెల 19 నుంచి 22 వరకూ విజయవాడలోని డీఆర్ఎంసీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు షటిల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలు నిర్వహించారు. 50 ఏళ్ల విభాగంలో గౌరీకుమారి పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వచ్చేనెల13 నుంచి బీహార్ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ పోటీలకు ఆమె హాజరుకానున్నారు.

## కాంగ్రెస్ పార్టీ పరిశీలకుల రాక రేపు

గుమ్మలక్ష్మీపురం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలో ఈనెల 27న కాంగ్రెస్ పార్టీ పరిశీ లకులు పర్యటించనున్నారని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవ నానికి సంఘటన్ శ్రీజన్ అభియాన్‌లో భాగంగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అబ్జర్వర్ దేబాసిస్ పట్నాయక్ (న్యూఢిల్లీ ఎమ్మెల్యే), ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జిలు జగత శ్రీనివాస్, కామన ప్రభాకర్, వేగి వెంకటేష్, అరకు పార్లమెంట్ అధ్య క్షుడు శతాక బుల్లిబాబు మన్యం జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారన్నారు. పార్టీ పరిశీలకులు ఆయా నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో చర్చించి పార్టీ బలోపేతానికి దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు ఎం.ఫ్రాన్సిస్, కోలక జయరాం పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

సీతానగరం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న సేవలను మంగళవారం ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న సేవలు, మందులు లభ్యత, మందుల నిల్వలు, కుక్క కాటు, పాము కాటు వ్యాక్సిన్లు ఉన్నవీ లేనివీ పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు తాగునీరు సౌకర్యం, అత్యవసర సేవలు పొందడానికి అవసరమైన వనరులు కల్పించడానికి బెడ్స్, మందులు నిరంతరం ఉన్నవి లేనివి టెక్నీషియన్, ఫార్మాసిస్టులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ పి.ఉషారాణి, సీహెచ్‌వో ఎన్వీ రమణ, సీనియర్ సహాయకులు సురేష్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయండి



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

సీతానగరం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోతలు పూర్తయి ధాన్యం నిల్వలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలు తెరిచారని, మరికొన్ని చోట్ల ఇంకా ప్రారంభించ లేదన్నారు. ధాన్యం నిల్వలకు సరిపడే గోనె సంచులు ఎక్కడ కూడా పూర్తిస్థాయిలో లేవన్నారు. క్వింటాకు రూ. 2,369లు ధర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, అందుకు అనుగుణంగా ఎక్కడా కొనుగోలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని కొను గోలు కేంద్రాల ద్వారా వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు బి.అప్పారావు, మండల అధ్యక్షుడు చిట్టి సూర్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి, సీఐటీయూ మండల కార్యదర్శి గవర వెంకటరమణ, రైతులు బల్ల నారాయణ స్వామి, మూడడ్ల రాఘవ, రెడ్డి సింహాచలం, చంద్రినాయుడు తదతరులు పాల్గొన్నారు.



## భజన మందిరాల నిర్మాణానికి దరఖాస్తుల ఆహ్వానం

**●జిల్లా దేవదాయశాఖ అధికారి రాజారావు**



బెలగాం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): భజన మండపాల నిర్మాణానికి ఆసక్తి గల గ్రామాలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దేవదాయశాఖ అధికారి రాజారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు మంజూరు చేస్తుందన్నారు. దరఖాస్తు చేసుకున్న గ్రామంలో ఎటువంటి అలయాలు ఉండకూడదన్నారు. ఇందుకు గానూ మూడు విడతలు గా నిధులు మంజూరు చేస్తారన్నారు. భూమి చూపిస్తే నిర్మాణానికి సంబంధించిన స్థల పరిశీలన చేస్తామని వెల్లడించారు. నిర్మాణ నమూనా కూడా దేవదాయ శాఖ అధికారుల సూచన ప్రకారం జరగాలన్నారు. భజన మండపాల నిర్మాణాలు మూడు రకాలుగా వర్గీకరిం చారని ఇందులో ఎ-రకం నిర్మాణానికి రూ.10 లక్షలు అంచనా విలువ అయితే ఐదు సెంట్లు స్థలం అవసరమని, బీ-రకం నిర్మాణానికి రూ.15 లక్షలు అయితే 10 సెంట్లు స్థలం అవసరమని, సి-రకం నిర్మాణానికి 20 సెంట్లు స్థలం అవసరమని ఆయన పేర్కొన్నారు.